# విమర్శిస్తే నాయకులవుతారా..?

- తెలంగాణను ఎండబెట్టిన వారికి అవకాశమివ్వాలా?
- రాహుల్.. కుటుంబ పాలన అంటే మీదే..
- రాసిచ్చిన స్క్రిప్ట్ చదివే వారికి ఏం తెలుస్తుంది
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్


బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, నవంబర్ 1 : సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను తిడితే నాయకులవుతారా అంటూ ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుటుంబ పాలనపై రాహుల్‌గాంధీ మాట్లాడడం విడ్డూరంగా ఉందని.., ఆయన రాజకీయాల్లోకి ఎలా వచ్చాడో చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. మీ తాత ముత్తాతల నుంచి నీకు రాజకీయ వారసత్వం వచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ.. ఇలా మీరంతా ఒక్క కుటుంబం కాదా అని పేర్కొన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా స్వరాష్ట్రం కోసం శ్రమించిన సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు రాజకీయాల్లో ఉంటే తప్పేముందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఢిల్లీలో ఉంటే.. తమ నాయకుడు, ప్రగతి ప్రదాత సీఎం కేసీఆర్ గల్లీలో ఉన్నారనే విషయాన్ని గమనించాలన్నారు. తామే వస్తాం.. ఏదో చేస్తాం.. అంటూ చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్న రాహుల్‌గాంధీకి ఇక్కడ జరిగే విషయాలేలా తెలుస్తాయన్నారు. ఆయన ఒక రీడర్‌లాగా పనికివస్తారన్నారు. రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లకు పైగా అవినీతి జరిగిందని మాట్లాడుతున్న రాహుల్‌ను చూస్తే జాలి కలుగుతున్నదన్నారు. 1969 ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజలకు తీవ్రంగా అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రం ఇచ్చినట్లే ఇచ్చి ఆలస్యం చేసి అనేక మంది ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నదని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ జోడో యాత్ర ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ తప్పా వేరే పార్టీ ఉండకూడదన్నదే వారి కుటిల ప్రయత్నమన్నారు. అందులో భాగంగానే బీజేపీ నుంచి వచ్చిన వ్యక్తికి మహబూబ్‌నగర్ కాంగ్రెస్ టికెట్ ఇచ్చారన్నారు. తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వనని అసెంబ్లీలో తెగేసి చెప్పిన వ్యక్తి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాదా అని ప్రశ్నించారు. హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు, ఆర్డీఎస్ నుంచి అక్రమంగా నీటిని తరలించి తెలంగాణను ఎండబెట్టిన వారికి అధికారం ఎలా ఇస్తామన్నారు. రాహుల్‌గాంధీ పొర్లిపొర్లి దండాలు పెట్టినా ప్రజలు నమ్మరన్నారు. ప్రాణాలు లెక్కచేయకుండా ఉద్యమం చేసిన పార్టీకి భయం అనేదే లేదన్నారు. దర్శకుడు దాసరి తీసిన ఎమ్మెల్యే ఏడుకొండలు సినిమా లాగా కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని.. అనేక మంది ముఖ్యమంత్రి ఆశావహులు ఉన్న పార్టీలో పగటి కలలు కంటున్నారన్నారు. కిరాయి సర్వేలతో ఎలాంటి ఉపయోగం లేదని, ప్రజలకు మంచి చేయాలనే తపనతో బీఆర్ఎస్ నిరంతరం శ్రమిస్తుందన్నారు. వ్యక్తులను కొనొచ్చు కానీ ఓటర్లను కొనలేరన్నారు. మంచి చేసిన బీఆర్ఎస్ వైపే ప్రజలంతా ఉన్నారని తెలిపారు.

***కాంగ్రెస్ పార్టీది మోస చరిత్ర.. : మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్***

కాంగ్రెస్ పార్టీ ఉన్నదే ప్రజలు, నాయకులను మోసం చేసేందుకని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ తెలిపారు. వారి చేతుల్లో మోసపోయిన తానే ఒక ఉదాహరణ అని అన్నారు. రాష్ట్రంలో బీసీలు బలంగా ఉన్న చోట టికెట్లు లేకుండా చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. ఎక్కడైతే ఓడిపోతారో అక్కడ మాత్రమే బీసీలకు సీట్లు ఇస్తున్నదంటూ మండిపడ్డారు. బీసీవాదం లేదని చెప్పేందుకే ఇలాంటి కుటిల యత్నాలు చేస్తున్నదన్నారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లో పార్టీ కోసం కష్టపడి శ్రమించిన నాయకులను కాదని.. డబ్బులు తీసుకొని అగ్రవర్ణాలకు సీట్లు కేటాయించిందన్నారు. రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వంటి నాయకులు ఉన్నంత వరకు బజారులో కూరగాయల్లాగా టికెట్లు అమ్ముకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ సామాజికవర్గ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, ముడా చైర్మన్ వెంకన్న, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, నాయలు రామకృష్ణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

***అభివృద్ధిలో భాగస్వాములవుతాం..***

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 1 : పదేండ్లలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేసిన అభివృద్ధిని చూసి.. తాము కూడా భాగస్వాములయ్యేందుకు బీఆర్ఎస్‌లోకి వచ్చామని ఆమ్ ఆద్మీ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి తెలిపారు. ఆమ్‌ఆద్మీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, శ్రీనివాస్‌కుమార్, సతీశ్‌రెడ్డి, రాములు, బాల్‌రెడ్డి, రఘు, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, సాబేర్‌తోసహా 200 మంది.., అలాగే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు నయీమ్ ఆధ్వర్యంలో 300 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాంలక్ష్మణ్, నాయకులు నటరాజు, షబ్బీర్, రమణయ్య ఉన్నారు.

***మరింత అభివృద్ధే తమ లక్ష్యం..***

మహబూబ్‌నగర్ టౌన్, నవంబర్ 1 : మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మరింత డెవలప్ చేయడమే తమ లక్ష్యమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మున్సిపాలిటీలోని న్యూమోతీనగర్, న్యూగంజ్, క్రిష్టియన్‌పల్లి, ఓల్డ్‌మోతీనగర్, పోచమ్మ టెంపుల్ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. సంజయ్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు ఎక్కడ నష్టం జరుగుతుందో అక్కడ తాను ఉంటానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింహులు, నాయకులు రషీద్‌ఖాన్, ఖాజాపాషా, బాబుల్‌రెడ్డి, పెద్ద విజయ్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన ధన్వాడ మండల నాయకులతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమే..

- సాధ్యం కాని హామీలిస్తూ ఓట్లు దండుకునే యత్నం
- నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేటరూరల్, నవంబర్ 1 : కాంగ్రెస్ నమ్మి ఓట్లు వేస్తే వ్యవసాయానికి కరెంట్‌లేక రైతులు ఆగం అవుతారని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని శేర్నపల్లి, సింగారం, శాసన్‌పల్లి, లింగంపల్లి, పిల్లిగుండ్ల తండా, పాతతండాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు మోసపూరిత హామీలు ఇవ్వడంతోపాటు ఆరు గ్యారెంటీల పేరిట ఓట్లు రాబట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నదని మండిపడ్డారు. కర్ణాటకలో మాయమాటలతో అధికారంలోకి వచ్చి నేడు ప్రజలను నానా రకాలుగా ఇబ్బందుల పాలుచేస్తున్నదన్నారు. సాధ్యం కాని హామీలను ఇచ్చి వాటిని అమలుచేయలేక చేతులెత్తేసిందన్నారు. రైతులకు మూడు గంటల కరెంట్ మాత్రమే చాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చెబుతున్నారని.. అలాంటి వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. తమ ప్రభుత్వం చేసే వాటినే హామీలుగా ప్రకటిస్తుందని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల కింద సాగునీరందించి రైతుల పాదాలు కడుతానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, రైతుబంధు సమితి సభ్యుడు జగన్మోహన్‌రెడ్డి, మైనార్టీ సంఘం మండలాధ్యక్షుడు అలీశేర్, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి పాల్గొన్నారు.

***గెలుపే ధ్యేయంగా పనిచేయాలి..***

నారాయణపేట, నవంబర్ 1 : గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ధన్వాడ మండలంలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన నిరటిబాబా, బాలకృష్ణ, లక్ష్మయ్య, పాపన్న, లక్ష్మన్న, బాలప్ప, సుధాకర్, పవన్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే జిల్లా కేంద్రంలోని 19వ వార్డు కుర్వగేరిలో బీజేపీకి చెందిన 50 మంది యువకులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ధన్వాడ ఇన్‌చార్జి రాజవర్ధన్‌రెడ్డి, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండారెడ్డి, నాయకులు చంద్రకాంత్, ఫిరోజ్ పాల్గొన్నారు.


వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## ప్రజలంతా సీఎం కేసీఆర్ వైపే..

- అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యానిఫెస్టో అమలు
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, నవంబర్ 1 : ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పూజలు చేశారు. సెంటిమెంట్ ప్రకారం.. నియోజకవర్గానికి ఈశాన్య దిక్కున ఉన్న తాటిపర్తి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి.. కొత్తూర్, పెద్ద తండా, కరివెన గ్రామాల్లో పర్యటించారు. తాటిపర్తిలో సర్పంచ్ వెంకటయ్య, నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌దే విజయమని, అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యానిఫెస్టోలో ఉన్న వాటిని అమలుచేస్తామన్నారు. ప్రజలకు సాగునీటి గోసను తీర్చేందుకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ రూ.3,300 కోట్లతో దేవరకద్ర నియోజకవర్గానికి కరివెన ప్రాజెక్టును మంజూరు చేశారన్నారు. 19.5 టీఎంసీల ప్రాజెక్టును నిర్మించడం చాలా గొప్ప విషయమన్నారు. కర్ణాటకలో వ్యవసాయానికి కేవలం 5 గంటల కరెంట్‌ను ఇవ్వడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడు గంటల కరెంట్ వస్తుందని వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ప్రతి గ్రామంలో మహిళలు, యువకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు నర్సింహాగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, సర్పంచులు వెంకటయ్య, యాదయ్య, సాలి, జహంగీర్‌బీ, శేఖర్, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, బాలకోటి, రామకృష్ణ, ముడా డైరెక్టర్లు చంద్రశేఖర్‌గౌడ్, సాయిలు, కో ఆప్షన్లు అజీజ్, జాకీర్, నాయకులు నారాయణగౌడ్, సత్యనారాయణ, మురళీధర్‌గౌడ్, అశోక్‌గౌడ్, వెంకట్రాములు, రాములు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## పని జరగలేదనిపిస్తే ఓటెయ్యొద్దు..

- సీఎం కేసీఆర్ హయాంలో ఎంతో ప్రగతి సాధించాం
- స్వర్ణకారులకు అండగా ఉంటా : జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నవంబర్ 1 : ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఎంతో ప్రగతి సాధించామని, పని జరగలేదని మీకు అనిపిస్తే ఓటు వేయొద్దని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని స్వర్ణకారులు, బులియన్ మర్చంట్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమైక్య పాలనలో ఎంతో మంది సీఎంలు పనిచేశారని, వారి హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు విద్యుత్‌తో తీవ్ర ఇబ్బందులు పడ్డారని, నేడు నిరంతర విద్యుత్‌తో సాగువిస్తీర్ణం పెరిగిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్‌లోకి తీసుకురావడంతో పచ్చని పొలాలు కనిపిస్తున్నాయన్నారు. గత పాలకులు తాగునీళ్లు కూడా ఇవ్వలేకపోయారని, ఎన్నికల వేళ మాత్రమే కాంగ్రెస్ నాయకులు దర్శనమిస్తారన్నారు. స్వర్ణకారులు, బులియన్ మర్చంట్ వారికి అండగా ఉంటామన్నారు. కమ్యూనిటీహాల్‌కు స్థలం కేటాయిస్తామన్నారు. కాగా, స్వర్ణకారులు, బులియన్ మర్చంట్ సంఘాల సభ్యులు లక్ష్మారెడ్డి వెంటే ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ లక్ష్మి, సంగీత, నాటక అకాడమి మాజీ చైర్మన్ శివకుమార్, కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్, రమేశ్, చైతన్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాన్, నాయకులు రామ్మోహన్, శ్రీకాంత్ ఉన్నారు.

## బీఆర్ఎస్‌తోనే ప్రతి ఇంటికీ లబ్ధి

- అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి : ఎమ్మెల్యే చిట్టెం


ఎమ్మెల్యే చిట్టెంకు డబ్బులు అందజేస్తున్న బాలుడు కృష్ణవంశీ

నర్వ, నవంబర్ 1 : సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, నాడు కరువు కాటకాలతో అల్లాడిన ప్రాంతం నేడు పచ్చబడిందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుమార్‌లింగంపల్లి, రాంపూర్ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరువు కాటకాలతో అల్లాడిన రాష్ట్రంలో, బీడు భూములు మాత్రమే కనిపించే పొలాలు నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయన్నారు. రైతుల పక్షపాతిగా సీఎం కేసీఆర్ ఎన్నో రకాల పథకాలు ప్రవేశపెట్టారన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ గతంలో లేని విధంగా ప్రభుత్వ దవఖానల్లో కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. పుట్టబోయే పిల్లల నుంచి పండు ముదుసలి వరకు అండదండగా నిలుస్తున్న బీఆర్ఎస్‌కు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. ప్రతిపక్ష నేతల కల్లబొల్లి మాటలు విని మోసపోవద్దని, సంక్షేమాన్ని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములుశెట్టి, సర్పంచులు అరవింద్‌రెడ్డి, శివ, ఎంపీటీసీ పద్మ, పార్టీ మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు అయ్యన్న, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, కిరణ్‌ప్రకాశ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.

***నామినేషన్‌కు వికలాంగ బాలుడి విరాళం..***

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి నామినేషన్ ఖర్చుల కోసం రాంపూర్ గ్రామానికి చెందిన వికలాంగ బాలుడు కృష్ణవంశీ ఒక నెల పింఛన్ డబ్బులను రూ.4016ను ఎమ్మెల్యేకు అందజేశారు. పోష్టికాహారలోపంతో బాధపడుతున్న బాలుడికి ఎమ్మెల్యే ధైర్యం ఇచ్చారు. వైద్యం పరంగా తమ వంతు సహకారం అందిస్తానన్నారు.